సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



విద్యతోనే అభివృద్ధి సాధ్యం
చదువుకుంటే ప్రతిఒక్కరు అభివృద్ధి సాధిస్తారని సినీ నటి మంచులక్ష్మి అన్నారు.

వివరాలు 8లో ▸



క్రీడా హబ్‌గా..
తెలంగాణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని క్రీడల సలహాదారు జితేందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.9 /22.1

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరుగైన విద్య అందించాలి



గట్టు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించి వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రవీందర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు హంపయ్య, రామకృష్ణరావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేటి జాబ్‌మేళాకు ఉచిత బస్సు సౌకర్యం

అలంపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 22న మంగళవారం నిర్వహించే జాబ్‌మేళాకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంఈఓ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్‌మేళాకు అర్హులు అని, ఆసక్తి ఉన్న విద్యార్థులు విద్యార్హతకు సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్‌తో రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలంపూర్ చౌరస్తా నుంచి నాగర్‌కర్నూల్ జాబ్ మేళాకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు ఉదయం 8.30 గంటలకు బయల్దేరుతుందని, యువత ఉదయం 8 గంటల లోపు అలంపూర్ చౌరస్తాకు చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అధ్యాపకులు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి హృదయరాజు సూచించారు. సోమవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శివకుమార్, గోవర్దన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పీయూను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం



- విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా కోర్సులు రెగ్యులర్ చేసేందుకు కృషి
- నాన్‌టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచేలా చర్యలు
- ప్రైవేటు కళాశాలల్లో సిబ్బంది, వసతుల కల్పనకు ప్రాధాన్యం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి లా, ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి..
- 'సాక్షి'తో పాలమూరు యూనివర్సిటీ వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని అగ్రస్థాయి యూనివర్సిటీల సరసన నిలిపేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ప్రధానంగా పీయూలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కొన్నేళ్లుగా యూనివర్సిటీ ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇందులో ఎంతో మంది వీసీలు, రిజిస్ట్రార్ల కృషి ఉందని పేర్కొన్నారు. మున్ముందు మరింత అభివృద్ధి చేసేందుకు ఇక్కడి అధికారులు, సిబ్బంది, విద్యార్థుల సహకారంతో ముందుకెళ్తామన్నారు. సోమవారం ఆయన అడ్మినిస్ట్రేషన్ భవనంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు..

నా దృష్టికి వచ్చింది..

నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను వారు నా దృష్టికి తీసుకువచ్చారు. వేతనాల పెంపు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలు చర్చకు వచ్చాయి. వాటిలో మా పరిదిధి ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మా పరిధిలో లేని వాటిని ప్రభుత్వం, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపిస్తాను. సిబ్బంది కనీస వేతనాలు ఇచ్చేందుకు నా వంతుగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తాం.

కొత్త కోర్సులు తెస్తాం..

పీయూను రాష్ట్రంలోని మిగతా యూనివర్సిటీలకు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిన నేపథ్యంలో అన్ని వసతులు కల్పిస్తాం. ఇక్కడ అన్ని విభాగాల్లో కోర్సులు ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ విభాగంలో లేవు. వాటిని అందుబాటులోకి తీసుకువస్తాం. ఇప్పటికే భవన నిర్మాణం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ కోర్సులను అదుబాటులోకి తీసువస్తాం. అన్నీ అనుకూలిస్తే లా కోర్సులను కూడా తెస్తాం.

ప్రభుత్వం దృష్టికి..

పీయూలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుంటాం. ముఖ్యంగా విద్యార్థులు చదువుతున్న కోర్సులు సెల్ఫ్ ఫైనాన్స్‌వి ఉన్నాయి. వాటికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. వీటికి 75 శాతం వరకు ఫీజు ప్రభుత్వం చెల్లిస్తున్నా.. మిగిలినది విద్యార్థి చెల్లించాలి. ఈ విషయమై అన్ని అంశాలు తెలుసుకొని.. మా పరిధిలో ఉన్నంత వరకు పరిష్కరిస్తాం. మిగతా వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అంతేకాకుండా విద్యార్థులకు 24 గంటలు అందుబాటులో వైద్యం ఉండేలా అందేలా సేవలు విస్తరిస్తాం. ఇప్పటికే పీయూలో ఉన్న పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పిస్తాం. అత్యవసర సమయంలో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు అవసరమైన అంబులెన్స్ కూడా అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన భవనాలను అందుబాటులోకి వచ్చేలా చూస్తాం.

నాణ్యమైన విద్య అందిస్తాం..

పీయూ పరిధిలోని అప్లియేటెడ్ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ, పీజీ విద్యార్థులకు నాణ్యమైన విద్యే అందిస్తాం. కళాశాలల్లో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, తాగునీరు, బోధన సిబ్బంది తదితర పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా వసతులు లేని కళాశాలల వివరాలు తెలుసుకునేందుకు సమీక్ష నిర్వహించి వివరాలు సేకరిస్తాం. ప్రతి విద్యార్థికి కూడా నాణ్యమైన విద్య అందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాం. ప్రస్తుత సమాజానికి అవసరమైన కోర్సులను తీసుకువచ్చి వారికి చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

త్వరలోనే పోస్టుల భర్తీ..

పీయూలో నిర్ణయాలు తీసుకునేందుకు ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ ప్రస్తుతం లేదు. 13 మంది కౌన్సిల్ సభ్యులను నియమించేందుకు ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. దీనిపై రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను భర్తీ చేసిన తర్వాత ఈసీ సభ్యులను కూడా నియమించాలని భావించింది. ప్రస్తుతం రిజిస్ట్రార్ పోస్టులు ఉన్నప్పటికీ ఈసీ భర్తీ తర్వాతనే రిజిస్ట్రార్ మార్పులకు అవకాశం ఉంది. వివిధ విభాగాల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయి.. అదనంగా ఎక్కడ పనిచేస్తున్నారు.. ఖాళీగా ఉన్న పోస్టులలో జాయింట్ డైరెక్టర్లు, ఇన్‌చార్జ్ పోస్టులు భర్తీ చేసేందుకు దృష్టిసారిస్తాం. ఇందుకోసం ప్రత్యేక విధానంలో సిబ్బంది పని అనుభవం, వారి అర్హతల ఆధారంగా భర్తీ చేస్తాం.

అవినీతి డొంక కదిలింది

ముంపు బాధితుల పేరిట పరిహారాన్ని డబుల్ క్లెయిమ్ చేసుకునేందుకు యత్నం



- ఉన్నతాధికారులే.. పాత్రధారులు
- హైకోర్టు ఆదేశాల మేరకు ఠాణాలో కేసు నమోదు?

గద్వాల: బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాల్సిన ఉన్నతాధికారులే అవినీతికి పాల్పడిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. ఇందులో రెవెన్యూ, న్యాయశాఖలకు చెందిన కీలక అధికారులు, సిబ్బందితో పాటు, కొందరు న్యాయవాదులు అవినీతికి యత్నించి దొరికిపోవడం సంచలనంగా మారింది. గద్వాల జిల్లాలో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, జూరాల హైడల్ ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించిన వ్యవహారంలో భూములు కోల్పోయిన బాధితుల పేరిట పరిహారాన్ని డబుల్ క్లెయిమ్ చేసేందుకు యత్నించారు. అయితే పరిహారం తీసుకునే బాధితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టే క్రమంలో డబుల్ క్లెయిమ్ చేస్తున్నట్లు గుర్తించిన ఓ న్యాయ అధికారి పరిహారం వ్యవహారంలో సమగ్ర విచారణకు ఆదేశించారు. దీనికి సంబంధించిన పూర్తి రికార్డులను తెప్పించుకొని క్షుణ్ణంగా విచారణ జరిపారు. ఇందులో బాధితుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని రూ.కోట్లు స్వాహా చేసేందుకు యత్నిస్తున్నట్లు సదరు న్యాయ అధికారి గుర్తించారు. విషయాన్ని ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆధారాలు, రికార్డులు పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం... అక్రమాలకు యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కేసు నమోదు..?

హైకోర్టు ఆదేశాల మేరకు ముంపు పరిహారంలో చోటుచేసుకున్న అవినీతి బాగోతంలో రెవెన్యూ, భూసేకరణ శాఖలకు చెందిన ముఖ్య అధికారులు, సిబ్బంది, అదేవిధంగా న్యాయశాఖకు చెందిన కొందరు అధికారులు, సిబ్బందితో పాటు మరికొందరు న్యాయవాదులపై త్వరలోనే పోలీసులు కేసు కూడా నమోదు చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌ను సంప్రదించగా.. ఇప్పటి వరకు అలాంటిదేమి లేదని, కేసు నమోదు చేస్తే వివరాలు తెలియజేస్తామన్నారు. ఈ రోజు కోర్టు వద్దకు వెళ్లలేదని, ఎలాంటి సమాచారం లేదని, ఉన్నతాధికారులు వెళ్తే వెళ్లివుండవచ్చని చెప్పారు.

నిజాయితీ అధికారి బదిలీకి పైరవీలు

ఇదిలా ఉండగా అవినీతి బాగోతాన్ని బయటపెట్టారనే అక్కసుతో సదరు న్యాయ అధికారి బదిలీకి అక్రమార్కులు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఏకంగా హైదరాబాద్‌లో మకాం వేసి బదిలీ చేయించాలని అవిశ్రాంతగా శ్రమిస్తున్నట్లు తెలిసింది.

శాంతియుత సమాజమే లక్ష్యం



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే విజేయుడు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

గద్వాల క్రైం: శాంతియుత సమాజమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఫ్లాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. 1959 అక్టోబర్ 21వ తేదీన చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూ బాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన క్రమంలో జరిగిన పోరాటంలో 10 మంది భారత్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. అప్పటి నుంచి వారి త్యాగనిరితిని స్మరించుకుంటూ ప్రతి ఏడాది అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. చట్టాలను అమలు చేయడం, నిందితులకు శిక్షలు, విచారణ చేయడంతో పాటు ప్రజలకు జవాబుదారీగా ఉండే వ్యవస్థలో పోలీసుశాఖకే ప్రథమ స్థానం దక్కుతుందన్నారు. దేశానికి రక్షణ కల్పిస్తూ ఎందరో పోలీసు అమరవీరులు తమ ప్రాణాలను సైతం అర్పించారని, అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. అనంతరం సిబ్బంది, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు శ్రీను, టాటబాబు, రవిబాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్



కలెక్టరేట్ వద్ద ఫిర్యాదుదారులు

గద్వాల: సమస్యల పరిష్కారానికి ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై 40 ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. వీటిలో అత్యధికంగా భూసంబంధ సమస్యలు ఉన్నాయని వీటిని సంబంధిత అధికారులకు పంపినట్లు వచ్చిన ప్రతిఫిర్యాదుదారునికి పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అందుకు గల కారణాలు తెలుపుతూ ఫిర్యాదుదారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో మోసం చేశారు.. ఆదుకోండి

నకిలీ వీలునామాతో ఓఆర్‌సీ ఇచ్చి తమకు తీరని అన్యాయం చేశారని నన్నేసాబ్, మహమ్మద్, సుభాన్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు వారి మాటల్లోనే.. గద్వాల శివారులోని సర్వే నంబర్ 900లో 11.20 ఎకరాలు మాపేర్ల మీద ఉన్నాయి. ఈ భూమిలో బుడ్డల మిల్లును సైతం నిర్మాణం చేసుకున్నాం. ఈ భూమి మాకు వంశపారపర్యంగా సంక్రమించింది. అయితే ఇందులో కొంతభాగం ఔటర్ రింగురోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఈభూసేకరణలో పోయిన భూమికి సంబంధించి తమకు రావాల్సిన పరిహారం కోసం తాము ఆర్డీఓకు ఓఆర్‌సీ కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెవెన్యూ రికార్డు ప్రకారం తమకు ఓఆర్‌సీ ఇవ్వాల్సిన అధికారులు డబ్బులు తీసుకుని ఫేక్ వీలునామా సృష్టించి మా కుటుంబానికి సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చారు. దీనివెనకాల అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు సైతం పెద్ద ఎత్తున ముడుపులు ముట్టాయి. రాజకీయ పలుకుబడి, ముడుపులకు ఆశపడి తమకు చెందిన భూమిని ఇతర వ్యక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అదేవిధంగా ఈభూమికి సంబంధించి ఎలాంటి క్రయవిక్రయాలు జరపరాదని తహసీల్దార్, ఆర్డీవోలకు అర్జీతో పాటు తమ లాయర్ ద్వారా లీగల్‌నోటీసులు సైతం ఇప్పించాం. కానీ వీటన్నింటిని పట్టించుకోని అధికారులు కేవలం డబ్బులకు ఆశపడి ఈ భూమిపై క్రయవిక్రయాలు జరిపి తమకు తీరని అన్యాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు నిజాయితీగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని లేనిపక్షంలో చావేశరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

అయోడిన్ లోప రుగ్మతలను నివారిద్దాం

ధరూరు: అయోడైజ్ ఉన్న ఉప్పును వాడి పిల్లల్లో అయోడిన్ లోప రుగ్మతలను నివారిద్దామని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యా కిరణ్ అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మత నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై మట్లాడారు. మానసిక, శారీరక ఆరోగ్యం, సరైన పెరుగుదల, చురుకుదనం, ఉత్సాహం, జ్ఞాపకశక్తి కలిగి ఉండడం, సంగ్రహణ శక్తి పెరగడం వంటి అనేక రకాల ప్రయోజనాలు ఒక్క అయోడైజ్ ఉప్పులో ఉన్నాయన్నారు. సరైన మోతాదులో వాడకపోతే గర్భస్రావం, మృత శిశువు జననం, గొంతు వాపు, మరుగుజ్జుతనం, చెవిటి, మూగ, బుద్ధమాంద్యం, చదువులో వయస్సుకు తగ్గ ప్రతిభ చూపించకపోవడం వంటి అనేక రకాల సమస్యలను, నష్టాలను చవి చూడాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అలాగే సీజనల్‌గా వచ్చే వ్యాధులపై జాగ్రత్త వహించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, ఎన్‌సీడీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, సీహెచ్‌ఓ ఆనందయ్య, సూపర్‌వైజర్లు, హీర్యానాయక్, నర్సింహులు, సుజాత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యాకిరణ్

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్, LXIII ఆఫ్ 1951 క్రింద స్థాపించబడినది)
మహబూబ్‌నగర్ బ్రాంచ్

ISO

ఇ-వేలం అమ్మకం ప్రకటన SARFAESI చట్టం, 2002 క్రింద చర/స్థిరాస్తుల అమ్మకం

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) & 9 (1)తో చదువబడు)

సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ వివరించిన చర/స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనంలోకి తీసుకోబడినవని అవి దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు ష్యూరిటీల నుండి దిగువ తెలిపిన బకాయి ఉన్న మొత్తం రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నవో అవే ప్రాతిపదికన" మరియు సహాయం లేని ప్రతిపాదికన 22.11.2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీలకు మరియు ష్యూరిటీలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల కొరకు రిజర్వు ధర, బయానా మరియు తెలిపిన రుణభారాలు దిగువ విధంగా ఉన్నాయి.

రుణగ్రహీత/గ్యారంటారు	30.09.2024 నాటికి బకాయి మొత్తం (రూ.లక్షలలో)	ఆస్తి వివరణ	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా ప్రకటన తేది	రిజర్వు ధర (రూ. లక్షలలో)	బయానా (రూ. లక్షలలో)	బిడ్ గుణకాల మొత్తం (రూ.)
రుణగ్రహీత/గ్యారంటీ: M/S పరమేశ్వర రెడ్డి & కో, ఆస్తి శ్రీ మాచిరెడ్డి పల్లి ధర్మారెడ్డి తండ్రి నారాయణరెడ్డికి చెందినది	రూ. 884.18	వసనత్తి లోన్ మరియు జిల్లా, వల్లభనగర్, 98.3 చ.గజాల విస్తీర్ణం, ప్లాట్ నెం. 113 పార్టులో నిర్మించిన, నం. 38-58 కలిగిన నివాస ఇల్లు పరిహద్దులు: తూర్పు: యం. నారాయణ రెడ్డికి చెందిన ఇల్లు (ఇ.నం. 38-59), పశ్చిమం: శ్రీమతి బి. రత్నమ్మకు చెందిన ఇల్లు (ఇ.నం.38-57), ఉత్తరం: రోడ్, దక్షిణం: సిద్ధాంతి సత్యనారాయణకు చెందిన ఇల్లు	05.06.2018	09.12.2021	47.77	5.31	50,000/-
ఆస్తి శ్రీ యం. నారాయణరెడ్డి తండ్రి రంగారెడ్డికి చెందినది		వసనత్తి లోన్ మరియు జిల్లా, వల్లభనగర్, 98.3 చ.గజాల విస్తీర్ణం, ప్లాట్ నెం. 113 పార్టులో నిర్మించిన, నం. 38-59 కలిగిన నివాస ఇల్లు పరిహద్దులు: తూర్పు: యస్.రామేశ్వర్‌కు చెందిన ఇల్లు (ఇ.నం. 38-60), పశ్చిమం: యం.ధర్మారెడ్డికి చెందిన ఇల్లు (ఇ.నం.38-58), ఉత్తరం: రోడ్, దక్షిణం: సిద్ధాంతి సత్యనారాయణకు చెందిన ఇల్లు	05.06.2018	09.12.2021	47.77	5.31	50,000/-
రుణగ్రహీత/గ్యారంటీ: శ్రీమతి బి. చంద్రరేఖ ఆస్తి శ్రీమతి ఎస్. నారాయణమ్మకు చెందినది	రూ. 1151.48	వసనత్తి లోన్ మరియు జిల్లా, బండమీదిపల్లి గ్రామం, 214 చ.గజాల విస్తీర్ణం, ఇ.నెం. 38-81 కలిగిన నివాస ఇల్లు పరిహద్దులు: ఉత్తరం: రోడ్, దక్షిణం: ప్లాట్ నం.6, తూర్పు: ప్లాట్ నం.7, పశ్చిమం: ప్లాట్ నం. 162 అన్ని అనుభోగ హక్కులు మరియు దానిపై నిర్మించిన, నిర్మించబోయే భవనాలతో కలిసి.	05.06.2018	09.12.2021	48.74	5.42	50,000/-

ఇ వేలం తేది మరియు సమయం : ఇ-వేలం పోర్టల్ https://www.bankauctions.in ద్వారా 22.11.2024 న ఉదయం 11:30 గం॥ నుండి మ॥ 12:45 గం॥ వరకు 5 నిమిషాల సమయం గల అపరిమిత ఆటో పొడగింపుతో ఉంటుంది. ఆసక్తి గల బిడ్డర్లు తమ బిడ్లు దాఖలు చేయుట మరియు ఇ వేలంలో పాల్గొనుటకు ముందు వెబ్‌పోర్టల్స్ https://esfc.telangana.gov.in, https://esfc.ap.gov.in, మరియు https://www.bankauctions.in లో లభించు ఇ-వేలం యొక్క వివరమైన నియమ నిబంధనలను చదువుకోవల్సిందిగా సూచించడమైనది. ప్రతి టెండర్ దారు అమ్మకం కొరకు నియమ నిబంధనలను చదువుకొని, అంగీకరించారని భావించబడును. బయానా మొత్తాన్ని దిగువ తెలిపిన అకౌంట్ : అకౌంట్ లబ్దిదారు APSFC, కెనరా బ్యాంక్ మహబూబ్‌నగర్ బ్రాంచ్ అకౌంట్ నం.34201010000160 (IFC Code : CNRB0013420) లో NEFT/RTGS ద్వారా చెల్లించాలి. బయానా మొత్తంతోపాటు టెండర్ ఫారం స్వీకరించుటకు ఆఖరు తేది:20.11.2024న సా॥ 5:00 గం॥ల వరకు ఇ-వేలం టెండరు ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం సాధారణ నియమనిబంధనలు కలిగిన ఇ-వేలం బిడ్ డాక్యుమెంట్ https://esfc.telangana.gov.in, https://esfc.ap.gov.in, మరియు https://www.bankauctions.in లో కూడా లభిస్తాయి. ఏవేని తదుపరి వివరాలు/స్పష్టీకరణల కోసం కాగోరు బిడ్డర్లు అధీకృత అధికారిని మొబైల్ నెం.9949984822/ 9949358509 పైన సంప్రదించవచ్చును.

తేది: 21.10.2024
ప్రదేశం: మహబూబ్‌నగర్

సం/- అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్

ISO
విజయవందన టవర్స్, మారుతీ షోరూం ఎదురుగా, మెట్టుగడ్డ, మహబూబ్‌నగర్ - 509001
E-Mail mbn-general@tgsfc.in. ఫోన్ నంబరు : 9949358509

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


బుచ్చాచారి(ఫైల్)

చారకొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని తిర్మలగిరి స్టేజి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వంగూరు ఎస్‌ఐ మహేందర్ వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన బుచ్చాచారి(35) ఆదివారం రాత్రి తిర్మగిరి పెట్రోల్ బంక్‌లో ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోసుకొని తిరిగి డిండికి వెళ్తుండగా, అచ్చంపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన బుచ్చాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వ్యక్తి..

కల్వకుర్తిరూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మార్చాల వద్ద కోదాడ, జడ్చర్ల జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి 30 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచామన్నారు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బండమీదిపల్లి సమీపంలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి (35) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి చెయ్యిపై కుమార్ అనే పచ్చబొట్టు తప్పా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన ఓర్సు సైదమ్మ(35) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. ఈనెల 13న సైదమ్మ మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త లింగస్వామి, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోపల్‌దిన్నెలో యువకుడు..

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన మిట్ట కడుపుల మహేష్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. వారం రోజుల క్రితం కుటుంబ కలహాలతో అతడు ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పివేసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వారం రోజులపాటు చికిత్స పొందిన అతడికి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని.. బాలిక ఆత్మహత్యాయత్నం

మల్దకల్: ఇంట్లో బంగారు దొంగిలించారనే నెపంతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన ఓ బాలిక(16) గద్వాల్‌లోని సీడ్ ఆర్గనైజర్ సత్యారెడ్డి ఇంట్లో పనిచేస్తుంది. ఈ క్రమంలో ఇంట్లో బంగారం చోరీ చేసిందనే నెపంతో బాలికను పనిలో నుంచి మాన్పించారు. మరోమారు ఇంట్లో బంగారం చోరీకి గురికావడంతో బాలికపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు బాలికను స్టేషన్‌కు పిలిపించి విచారించడంతో అవమానింగా భావించిన పదిరోజుల క్రితం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే బాలికను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. తాజాగా ఈ విషయం తెలుసుకున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లు రంజిత్‌కుమార్ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలికను పనిలో పెట్టుకోవడమే కాక దొంగతనం మోపిన సీడ్ ఆర్గనైజర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. ఈ విషయమై ఏఎస్‌ఐ ఈశ్వరయ్యను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి
- ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్, గ్రీనర్ ఏర్పాటుకు భూమిపూజ


ఎండీసీఏ మైదానంలో టర్ఫ్ వికెట్‌కు భూమిపూజ చేస్తున్న రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు జితేందర్‌రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో సోమవారం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో కలిసి టర్ఫ్ వికెట్, గ్రీనర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం నూతన వాష్‌రూంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో క్రీడలను నిర్లక్ష్యం చేసిందన్నారు. కేవలం బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.375 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 119 నియోజకవర్గాల్లో దాదాపు 10 ఎకరాల్లో స్టేడియాలు, అకాడమీలు ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడాకారుల సౌకర్యార్థం ఎండీసీఏ మైదానంలో గ్యాలరీ, గదులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో అకాడమీ ఏర్పాటు..

మహబూబ్‌నగర్ మైదానంలో అన్ని వసతులు సమకూరిన తర్వాత అకాడమీ ఏర్పాటుచేస్తామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అన్నారు. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో క్రికెట్‌ను అభివృద్ధిపరిచి, రంజీ మ్యాచ్‌లు ఆడించాలన్నదే తమ అపెక్స్ కౌన్సిల్ ఆలోచన అని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో రంజీ మ్యాచ్‌లు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. రూ. 5లక్షల నిధులతో మైదానంలో స్టోర్‌రూం నిర్మిస్తామని, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం అండర్-23 ఉమ్మడి జిల్లాస్థాయి టోర్నీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్.దేవరాజ్, ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జిత్‌సింగ్, కోశాధికారి సీజే శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి టి.బస్వరాజ్, పారిశ్రామికవేత్త బసిరెడ్డి, ఎండీసీఏ ప్యాట్రన్ మనోహర్ రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కృష్ణమూర్తి, పాపారాయుడు, మోతీలాల్, తిరుమల వెంకటేశ్, ప్రశాంత్, చంద్రకుమార్‌గౌడ్, లక్ష్మీకాంతరావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, ఎండీ మన్నాన్ పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- ఆలూరులో స్మార్ట్ తరగతి గదిని ప్రారంభించిన సినీనటి మంచులక్ష్మి


ఆలూరులో స్మార్ట్ తరగతి గది ప్రారంభోత్సవంలో సినీనటి మంచులక్ష్మి , తదితరులు

గట్టు: చదువుకుంటేనే అభివృద్ధి సాధ్యమని, తల్లిదండ్రులు వారి పిల్లలను తప్పకుండా పాఠశాలకు క్రమం తప్పక పంపాలని సినీ నటి, టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచులక్ష్మి కోరారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఆలూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన స్మార్ట్ తరగతిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచులక్ష్మి మాట్లాడుతూ విద్యలో గట్టును ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. పత్తి పొలాల్లో పిల్లల చేత పనులు చేయించడం మానుకోవాలని హితవు పలికారు. పిల్లలను చక్కగా చదివించి, ప్రయోజకులను చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. గట్టు మండలంలోని 21 పాఠశాలలను తాను దత్తత తీసుకున్నానని, జోగుళాంబ అమ్మవారి దయ ఉండే జిల్లాను దత్తత తీసుకుని విద్యలో ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. టీచ్ ఫర్ చేంజ్ ద్వారా విద్యలో మార్పులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇక్కడ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి ఎంతో ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యాభివృద్ధికి గట్టు మండలాన్ని మంచులక్ష్మి ఎంచుకోవడం అభినందించతగ్గ విషయమని జిల్లా విద్యాధికారి రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ఫెడా సిస్టమ్స్ అధినేత ధరణికోటి సయోదన్, విద్యాశాఖ జిల్లా సమన్వయ అధికారులు ఎస్తేర్‌రాణి, అంపయ్య, కార్యాలయ పర్యవేక్షణ అధికారి రామకృష్ణారావు, ఎంఈఓ నల్లారెడ్డి, హెచ్‌ఎం రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు సహకారం

గద్వాల: జిల్లాలో పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా స్వచ్ఛంద సంస్థలకు ఎల్లప్పుడూ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మంచులక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా స్వచ్ఛంద సంస్థలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో, ముఖ్యంగా గట్టు మండలంలో పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీసీఈఓ కాంతమ్మ, జిల్లా సమన్వయకర్త హంపయ్య, తదితరులు ఉన్నారు.

10 మంది జీహెచ్‌ఎంలపై వేటు

- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి ఆర్జేడీ
- బదిలీల్లో తప్పుడు సమాచారంపై సాక్షిలో ప్రచురితమైన కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 10 మంది జీహెచ్‌ఎంలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 2023 సెప్టెంబర్ నెలలో జీహెచ్‌ఎంల బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు జీహెచ్‌ఎంలు స్పౌజ్ పాయింట్లు, మెడికల్, ఇతర సమాచారం ఇవ్వడంలో తప్పుగా సమాచారం ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పలువురు సంఘాల నాయకులు సైతం జిల్లా అధికారులకు, రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారు. ఈ విషయంపై 'సాక్షి' పలు కథనాలను ఇచ్చింది. దీంతో మొదట వారికి అధికారులు నోటీసులు ఇచ్చారు. వీరు నోటీసులపై నిర్ణయిత గడువులో సమాధానాలు సైతం ఇచ్చారు. నోటీసులకు వీరు ఇచ్చిన సమాచారం ద్వారా తప్పులు జరిగాయని భావించి ఆర్జేడీ సస్పెన్షన్ వేటు వేయాలి ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంపై డీఈఓ రవీందర్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా 10 మంది జీహెచ్‌ఎంలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలను వచ్చాయని, వాటిని అనుసరించి సంబంధిత జీహెచ్‌ఎంలకు వాట్సప్, మెయిల్ ద్వారా సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.

బదిలీల్లో గోల్‌మాల్!



వేటు పడిన జీహెచ్‌ఎంలు వీరే..

వనజ (ఎన్మన్‌గండ్ల పాఠశాల, నవాబ్‌పేట్), సరస్వతి (బాలానగర్, బాలికల హైస్కూల్), నాగేంద్రమ్మ (దేవరకద్ర గర్ల్స్‌స్కూల్), నాగ్యనాయక్ (నవాబ్‌పేట్ స్కూల్), యుగేందర్ (ఆలూర్ స్కూల్ జడ్చర్ల), వెంకటేశ్వరమ్మ (కోడూర్ స్కూల్ మ.నగర్ రూరల్), కృష్ణవేణి (కొమిరెడ్డిపల్లి, గండేడ్), కృష్ణయ్య (ధర్మాపూర్ స్కూల్, మ.నగర్ రూరల్) చంద్రకళ (బాలుర పాఠశాల, బాదేపల్లి), వెంకట్‌రెడ్డి (పోలేపల్లి, జడ్చర్ల).

సమాజ శ్రేయస్సే పోలీసుల లక్ష్యం


మాట్లాడుతున్న బెటాలియన్ డీఐజీ ఎం.ఎస్ సిద్దికి

ఎర్రవల్లి: సమాజ శ్రేయస్సే పోలీసుల అంతిమ లక్ష్యమని బెటాలియన్ డీఐజీ ఎం.ఎస్ సిద్దికి. అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై కమాండెంట్ సాంబయ్యతో కలిసి అమరుల స్మారక స్థూపం దగ్గర పూలమాలలు వేసి అమరులను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజా రక్షణ కోసం ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించారన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. అనంతరం వీరమరణం పొందిన పోలీసు కుటుంబ సభ్యులతో బెటాలియన్ కమాండెంట్‌తో కలిసి ఆయన మాట్లాడి వారికి ఎల్లవేళలా ప్రభుత్వం, పోలీస్ వ్యవస్థ తోడుగా ఉంటుందని సూచించారు. అనంతరం బెటాలియన్‌లో వివిధ గ్రూప్స్, వెల్ఫేర్ కార్యాలయాలను పరిశీలించారు. అదేవిధంగా శిక్షణ పొందుతున్న 527 మంది టీజీఎస్పీ ఎస్సీటీపీసీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో విధి నిర్వహణలో వారు తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్ చౌహాన్, ఆర్‌ఐలు రాజారావు, గోపాల్, ఆర్.పి సింగ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీలకు ఆత్మగౌరవం


మాట్లాడుతున్న ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్

మహబూబ్‌నగర్ రూరల్: పాలనలో భాగస్వామ్యం బీసీలకు ఎక్కడ ఉందని, స్వరాష్ట్రంలోనూ పరాయి వారిగా మిగిలిపోయారని తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లో ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ మహేంద్ర అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ 54 శాతం ఉన్న బీసీలకు పాలనలో పాలకులు ఏ మేరకు అవకాశాలు కల్పిస్తున్నారని ప్రశ్నించారు. నిజంగా ఈ దేశంలో రిజర్వేషన్లు అమలు అవుతున్నాయా.. ఒకవేళ అమలైతే బీసీలకు ఈ పరిస్థితి ఎందుకు అని నిలదీశారు. స్వరాష్ట్రంలో పదేళ్ల బీసీలు భాగస్వామ్యానికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా బీసీలను కలుపుకొని పోతుందని భావిస్తే.. వీరు కూడా మోసం చేశారని విమర్శించారు. తెలంగాణలో రెడ్డిలు 3.4 శాతం కూడా లేరని, వాళ్లకు దక్కిన మంత్రి పదవులు ఎన్ని.. కార్పొరేషన్లు ఎన్ని.. మొత్తం ఎమ్మెల్యేలు ఎంత మంది.. మరి బీసీల పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాధికారంతోనే బీసీలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాల్లో భాగస్వామ్యం, ఆత్మగౌరవం దక్కుతుందన్నారు. కాబట్టి బీసీ యువత మేల్కొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు పోనూ మిగతా అన్ని స్థానాల్లో బీసీలు పోటీ చేసి గ్రామ, మండల స్థాయిలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాలు మొదలుకొని అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయి వరకు మన ఓట్లు మనం వేసుకొని అధికారం దక్కించుకుంటే ఎవరైతే నేడు కింది కులాలకు అవకాశాలు ఇస్తామంటున్నారో వారికే మనం రిజర్వేషన్లు ఇవ్వవచ్చన్నారు. సమావేశంలో సంచార జాతుల వ్యవస్థాపక అధ్యక్షుడు వీరన్న, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీనాథ్, దేవేందర్, శంకర్, మహేష్‌కుమార్, గణేష్, భీమేష్ పాల్గొన్నారు.

పెద్దగుట్టపై ఎండోమెంట్ అధికారి విచారణ



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై ఉన్న రంగనాయకస్వామి ఆలయం ప్రాంగణంలో జరిగిన విధ్వంసం గూర్చి దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఊరుకొండ ఆంజనేయస్వామి దేవాలయం ఈఓ సత్యచంద్రారెడ్డిలు సోమవారం విచారణ చేపట్టారు. గుట్టపైన భక్తులో మాట్లాడారు. కోనేరును, మెట్లమార్గాన్ని తొలగించగా, వాటిని పునరుద్ధరించినట్లు తెలిపారు. వందల ఏళ్లనాటి వృక్షాలను కూల్చివేశారని వారికి వివరించారు. ఆషాఢమాసంలో గుట్టపై ఘటన చోటుచేసుకోగా, ఇప్పుడు విచారణకు ఎందుకొచ్చారని కొందరు భక్తులు నిలదీశారు. అనంతరం ఆలయంలో జరిగిన కూలి ్చవేతల గూర్చి వారు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.


భవనాల నిర్మాణంలో వేగం పెంచాలి



ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఈడబ్ల్యూఐడీసీ ద్వారా చేపట్టిన భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం వీసీ చాంబర్‌లో ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీయూలో చేపట్టిన బాలికల హాస్టల్, క్యాంటీన్ వివరాలను తెలుసుకున్నారు. రీసెర్చ్ ఫెసిలిటీ భవనానికి మంజూరైన నిధులు, ఖర్చులపై ఆరా తీశారు. టెండర్ ద్వారా కేటాయించిన పెయింటింగ్, మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు పీఎం ఉషా స్కీం ద్వారా వచ్చిన నిధుల వివరాలను రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రూ. 100 కోట్లలో 70 శాతం నిధులు కొత్త భవనాల నిర్మాణానికి, మిగతా నిధులు భవనాల మరమ్మతు, యంత్ర పరికరాల కొనుగోలుకు వినియోగించాల్సి ఉందని తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థులకు హాస్టల్ వసతి తదితర వివరాలను తెలుసుకున్నారు. అయితే విద్యార్థులకు అదనంగా భవనాలను నిర్మించాల్సి ఉందని.. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం హాస్టల్ భవనానికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం పీయూలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల భవనాలు, బాలికల హాస్టళ్లను వీసీ పరిశీలించారు. వీటితో పాటు కబడ్డీ జట్ల ఎంపికలను పర్యవేక్షించారు. సమావేశంలో ఈడబ్ల్యూఐడీసీ అధికారులు రాంచందర్, రాములు, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

అడవి జంతువు దాడిలో 9 మేకలు మృతి

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మోర సైదమ్మ అనే మహిళా రైతుకు చెందిన 9మేక పిల్లలపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి. బాధితుల వివరాల ప్రకారం.. సైదమ్మ ఇటీవల మేక పిల్లలను కొనుగోలు చేసి వ్యవసాయ పొలంలో షెడ్ ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా అన్ని మృత్యువాత పడ్డాయి. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించారు. దాడి చేసిన ఆనవాళ్లు గుర్తించి నక్క దాడిచేసినట్లు వారు పేర్కొన్నారు. పశువైద్య అధికారులతో పంచనామా నిర్వహించారు. దాదాపుగా రూ.60వేల నష్టం ఏర్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. ఘటనా స్థలంలో ఫారెస్టు అధికారులు కురుమంతి, లలిత ఉన్నారు.


శ్రీశైలంలో ఐదు గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు


జూరాల నుంచి విడుదలవుతున్న వరద నీరు

జూరాల 20.. శ్రీశైలం 5..

గేట్లు ఎత్తిన అధికారులు

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: కృష్ణాబేసిన్‌లో ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో జూరాలకు 1.13లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు 20 గేట్లు ఎత్తారు. 82,980 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి కోసం 34,559 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు, కుడి కాల్వకు 720 క్యూసెక్కులు,ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 1,19,696 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ సూరిబాబు తెలిపారు. ఇప్పటివరకు ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 293.783 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 274.574 ఎంయూ ఉత్పత్తిని చేపట్టామన్నారు. మొత్తం568.357 మిలియన్ యూనిట్లు సాధించామని తెలిపారు.
- శ్రీశైలం ప్రాజెక్టులకు వరద నిలకడగా ఉంది. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో జూరాల నుంచి స్పిల్‌వే ద్వారా 82,980 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 34,559, సుంకేసుల నుంచి 51,324 మొత్తం 1,68,863 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 5 గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,888 మొత్తం 66,203 క్యూసెక్కుల నీటిని అదనంగా సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 884.3 అడుగుల వద్ద 211.4759 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

12 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో సోమవారం 12 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 54,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా స్పిల్‌వే ద్వారా 51,324 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,095 క్యూసెక్కులు వదులుతున్నట్లు పేర్కొన్నారు.

గండేడ్ పీఏసీఎస్‌కు తాళం

- రుణాల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ రైతుల ఆందోళన

గండేడ్: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం పలు గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. తమకు తెలియకుండా తమ పేర్లపై రుణాలు తీసుకున్నారని ఆరోపిస్తూ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తాము రుణాలు తీసుకోకపోయినా తీసుకున్నట్లు చూపారని, రుణమాఫీ జాబితా వచ్చాక గాని విషయం తమకు తెలియరాలేదని మండిపడ్డారు. ఈ విషయంపై దాదాపు గంటకు పైగా సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న చైర్మన్ లక్ష్మీనారాయణ కార్యాలయానికి చేరుకోగా రుణాల్లో అక్రమాలపై నిలదీశారు. తాము తీసుకున్న రుణాన్ని చెల్లించినా తిరిగి రుణమాఫీ జాబితాలో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. అయి తే కొందరివి లెడ్జర్‌లో క్లోజ్ చేసినా ఆన్‌లైన్‌లో క్లోజ్ కాలేదని, వాటిని గుర్తించి సరిచేశామని చైర్మన్ తెలిపారు. రైతులకు అన్యా యం జరగకుండా చూస్తామన్నారు. ఏమైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అయినప్పటికీ రైతు లు శాంతించలేదు. చైర్మన్, సిబ్బందిని బయటికి పంపించి కా ర్యాలయానికి తాళం వేశారు. అనంతరం చైర్మన్ లక్ష్మీనారాయణ రైతులకు నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.


గండేడ్ పీఏసీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ చౌటుప్పల్ సమీపంలో కేవలం 5 లక్షలకు ప్లాట్ కొంటే, 5 గ్రాముల బంగారం ఉచితం. Ph: 8332844579 [HA-05424]

SERVICES

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ బిజినెస్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీ+కమీ. Ph: 7988242391 [SCA24000453]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [HA-1381]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్